సాక్షి కామారెడ్డి

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



సెట్టింగ్ అదిరేలా..

వినాయక చవితి నవరాత్రులకు భారీ ఖర్చుతో సెట్టింగ్‌లు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా మారింది.

- 9లో ▸



కిటకిటలాడిన ఆలయాలు

శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
25.9 /23.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ తీవ్రత ఉండవచ్చు. మధ్యాహ్నం నుంచి మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నిజాంసాగర్ రెండు గేట్లు ఎత్తివేత



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి 16 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఘనపురం ఆనకట్ట ద్వారా 8 వేలు, హల్దీ వాగు ద్వారా 6 వేలు, పోచారం ప్రాజెక్టు ద్వారా 2 వేల క్యూసెక్కుల చొప్పున ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 2 వరద గేట్లను ఎత్తి 15 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు సోమవారం సాయంత్రానికి 1,405 అడుగుల(17. 8 టీఎంసీలు)తో నిండుకుండలా ఉంది.

17న జాతీయ సమైక్యతా దినోత్సవం

- ముఖ్య అతిథిగా స్పీకర్ పోచారం

సాక్షి, కామారెడ్డి : ఈనెల 17న జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ధర్నా



దోమకొండ: దోమకొండ మండలంలోని ముత్యంపేట గ్రామశివారులోని నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద గ్రామానికి చెందిన పలువురు సోమవారం ధర్నా నిర్వహించారు. పేద కుటుంబాలకు చెందిన తమకు ఇళ్లు కేటాయించాలని కోరారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్దకు కుటుంబాలతో కలిసి వెళ్లి వాటిలో తమ వంటసామగ్రిని పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ మహేందర్ పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తుందని అప్పటి వరకు ఎవరూ వాటిలో నివాసం ఉండరాదని అన్నారు. దీంతో రెవిన్యూ, పోలీస్ సిబ్బందితో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. తమ ఇళ్లు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయని, అక్కడ నివాసం ఉండలేకపోతున్నామన్నారు. పోలీసులు గ్రామస్తులను సముదాయించి అక్కడి నుంచి పంపించగా, వారు దోమకొండ తహసీల్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ సంజయ్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

'శిక్షణకు దరఖాస్తు చేసుకోండి'

నిజామాబాద్ అర్బన్ : న్యాయపరిపాలనలో ఉచిత శిక్షణ కోసం ఎస్సీ న్యాయవాదులు దరఖాస్తులు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు 8 సీట్లు కేటాయించామన్నారు. అభ్యర్థులు బార్‌కౌన్సిల్‌లో రిజిష్టరై ఉండాలన్నారు. అభ్యర్థి తండ్రి/సంరక్షకుడి సంవత్సర ఆదాయము రూ. 2 లక్షలకు మించరాదన్నారు. శిక్షణకాలంలో అభ్యర్థికి నెలకు రూ. 1,000 స్టైఫండ్ ఇస్తామని, శిక్షణపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను శాఖ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేసి ఆ దరఖాస్తులను కలెక్టరేట్‌లోని షెడ్యూల్డ్ కులా అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.


క్రీడా సాంస్కృతిక భవనం పనుల ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో సీడీపీ నిధులు రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న క్రీడలు సంస్కృతిక భవన పనులను సోమవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పురాతనమైన పంచముఖి హనుమాన్ ఆలయాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆలయాభివృద్ధికి తనవంతు సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు నరేష్, రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

'ఏనుగు' దారెటు!

- బీజేపీలో ఇమడలేకపోతున్న మాజీ ఎమ్మెల్యే
- టికెట్టు కోసం దరఖాస్తు చేసుకోని వైనం
- కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై దొరకని భరోసా
- అయోమయంలో అనుచరులు



ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి దారెటు అన్నదానిపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీజేపీలో ఇమడలేకపోతున్న అయన.. కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్‌లో చేరతారని భావించినా ఆ పార్టీ టికెట్టుపై భరోసా లభించకపోవడంతో కాస్త వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. బీజేపీ టికెట్టు కోసం కూడా దరఖాస్తు చేసుకోకపోవడంతో ఆయన అనుచరుల్లో గందరగోళం నెలకొంది.

సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తన కంటూ బలమైన అనుచరవర్గాన్ని కలిగి ఉన్న ఏనుగు రవీందర్‌రెడ్డి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. టీఆర్ఎస్ ఆవిర్భావం తరువాత కొంతకాలానికే ఉద్యోగాన్ని వదిలి పార్టీలో చేరిన ఏనుగు రవీందర్‌రెడ్డి.. 2004 ఎన్నికల్లో ఎల్లారెడ్డి టికెట్టు సాధించారు. టీఆర్ఎస్ హవాలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2008 ఉప ఎన్నికలలో ఓటమి చవిచూసినా ఆ తర్వాత 2009, 2010 ఉప ఎన్నిక, 2014 సాధారణ ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధిస్తూ వచ్చారు. 2018 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తరువాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన జాజాల సురేందర్ పార్లమెంట్ ఎన్నికల ముందు గులాబీ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులు రెండు గ్రూపులుగా చీలిపోయారు. పార్టీ అధిష్టానం నంచి సరైన సహకారం అందకపోవడంతో రవీందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కమలం గూటికి చేరారు.

కొంతకాలంగా దూరం..

బీజేపీలో కొంతకాలం క్రియాశీలకంగా పనిచేసిన రవీందర్‌రెడ్డి.. ఇటీవల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అనుచరుల ఒత్తిడితో బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. అయితే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి సుభాష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావులు టికెట్టు కోసం పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ఇద్దరిలో ఎవరో ఒకరికి కాంగ్రెస్ టికెట్టు వచ్చే అవకాశాలున్నా యి. ఈ నేపథ్యంలో ఏనుగు రవీందర్ రెడ్డికి ఎలాంటి గ్యారంటీ లభించలేదని తెలిసింది. టికెట్టు విషయంలో భరోసా లభిస్తేనే ఆయన పార్టీ మారాలనుకుంటున్నట్లు సమాచారం. మరోవైపు బీజేపీలో కూడా ఆయన యాక్టివ్‌గా లేరు. దీంతో ఆయనను నమ్ముకున్న అనుచరులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే కొందరు కాంగ్రెస్‌లో, మరికొందరు బీఆర్ఎస్‌లో చేరారు. మిగిలిన వారు ఎటు వెళ్లాలో తోచక గందరగోళంలో ఉన్నారు. రవీందర్‌రెడ్డి త్వరగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి తీసుకువస్తున్నట్టు తెలుస్తోంది.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

- ప్రజావాణికి 46 ఫిర్యాదులు..
- వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 46 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 28 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు చెందినవే. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయన్న, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మ ద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జంగిడి బర్రెల స్థలానికి పోడు పట్టాలు ఇచ్చారు..

గ్రామ శివారులో వంద సంవత్సరాలుగా జంగిడి బర్రెలను ఉంచడానికి వాడుతున్న స్థలానికి అటవీశాఖ అధికారులు పోడు పట్టాలు ఇచ్చారని ఆరోపిస్తూ లింగంపేట మండలం శెట్‌పల్లి గ్రామస్తులు సోమవారం ప్రజావాణికి విచ్చేశారు. వారు మాట్లాడుతూ.. సదరు భూమి సాగులో లేదన్నారు. ఏళ్లుగా బర్రెలు మేపడానికి వాడే భూమిని గిరిజనులకు పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అధికారులను అడిగితే పొరపాటున వచ్చిందని సమాధానం ఇస్తుండగా గిరిజనులు వచ్చి భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

శిలాఫలకాల ధ్వంసం..

భిక్కనూరు: మోటాట్‌పల్లి గ్రామంలో శిలాఫలకాలను ధ్వంసం చేసిన కేసులో చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ మోటాటి రాజేశ్వరి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తాము గ్రామంలో లేని సమయంలో శిలాఫలకాలను ధ్వంసం చేశారని, నిందితులను పట్టుకుని చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



కామారెడ్డిలో ఫారెస్టు అధికారుల బైక్ ర్యాలీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన జిల్లాకు చెందిన అటవీశాఖ అధికారులు అక్బరుద్దీన్, గంగయ్యలతో పాటు ఇటీవల గుత్తి కోయల దాడిలో అమరుడైన అటవీ అధికారి శ్రీనివాసరావుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అటవీశాఖ కామారెడ్డి డివిజనల్ అధికారి గోపాల్ రావు మాట్లాడుతూ.. అమరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎఫ్ఆర్‌వోలు రమేశ్, ఓంకార్, దివ్య, వాసుదేవ్, జూనియర్ అటవీ అధికారుల సంఘం అధ్యక్షుడు పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

- రెగ్యులరైజ్ చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్

కామారెడ్డి క్రైం: తమ సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని జిల్లాలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మొదటి రోజు సోమవారం కలెక్టరేట్‌లోని వివిధ శాఖలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల వారీగా ఉన్న ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కలెక్టరేట్‌లో జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ వ్యవస్థను తక్షణ మే రద్దు చేసి, రెగ్యులర్ లేదా కాంట్రాక్టు వ్యవస్థలో విలీనం చేయాలనీ, పేస్కేల్‌తో పాటు హెచ్ఆర్ పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పని చేసిన ఉద్యోగ కాలాన్ని లెక్కిస్తూ, మూడు సంవత్సరాల పైబడిన ప్రతి ఉద్యోగిని తక్షణమే రెగ్యులర్ వ్యవస్థలోకి తీసుకోవాలన్నారు. ఔట్ సోర్సింగ్ వ్యవస్థలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. నిరసన కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు అరుణ్, మహమ్మద్ అల్లావుద్దీన్, అనిల్, రాజేందర్, నిఖిల్, సతీష్, ప్రశాంత్, రమణారెడ్డి, అనసూయ శ్రీధర్, శ్రవణ్ కుమార్, నగేష్, రాజేందర్, నవీన్, పద్మ, లక్ష్మి, ఆయాజ్, ఇక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు

- ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా..
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



సంగం గ్రామంలో సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు తెలంగాణలో మాత్రమే అమలవుతున్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇతర ఏ రాష్ట్రంలో అయినా ఇటువంటి పథకాలు ఉంటే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. సోమవారం నస్రుల్లాబాద్ మండలంలోని హాజీపూర్, సంగం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. హాజీపూర్ గ్రామంలో రూ.2.71 కోట్లతో నిర్మించిన మత్తడి వాగు పంట కాలువ, రూ.1.71 కోట్లతో నిర్మించిన 34 డబుల్ బెడ్రూం ఇళ్లు, రూ.11 లక్షలతో పాఠశాల అదనపు తరగతి , రూ.8 లక్షలతో అంగన్వాడీ భవనం, ఎలక చెట్టు తండాలో రూ.8 లక్షలతో నిర్మించిన సేవాలాల్ మందిరం ప్రహరీ, రూ.5 లక్షలతో నిర్మించిన సేవాలాల్ మందిరం ప్రహరీలను, సంగం గ్రామంలో రూ.4.25 కోట్లతో నిర్మించిన 85 డబుల్ ఇళ్లు, రూ.25 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం,రూ.15 లక్షతో బీసీ కమ్యూనిటీ హాల్, రూ.55 లక్షలతో నిర్మంచిన ఎస్సీ కమ్యూనిటీ హాలు, రూ.11 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనం, రూ.25 లక్షలతో సలావత్ గల్లీలో సేవాలాల్ మందిరం నిర్మించిన కమ్యూనిటీ ప్రహరీ గోడ, రూ.30 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ ప్రహరీలకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం రూ.50 లక్షలతో దేవాదాయశాఖ నిధులతో నిర్మించే శివాలయానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ కాకతీయ పథకం కింద చెరువులకు పూడికలను తీయించామన్నారు. బాన్సువాడ నియోజక వర్గంలోనే రూ.150 కోట్లతో ఆలయాల అభివృద్ధికి నిధులు అందించామన్నారు. రూ.200 కోట్లతో సిద్దాపూర్ రిజర్వాయర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విఠల్, జెడ్పీటీసీ జన్నుబాయి, సర్పంచ్ లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు పెర్క శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు దివిటి శ్రీనివాస్‌యాదవ్, మారుతి,గంగారాం, జెడ్పీ కో ఆప్షన్ మాజీద్ ఖాన్, నాయకులు ప్రభాకర్ రెడ్డి, సాయాగౌడ్, రాము, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా..

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ఆయా జిల్లాల కలెక్టర్‌లు, అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితాల సవరణలపై పలు సూచనలు చేశారు. అ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలతో పాటు ఇప్పటి వరకు వచ్చిన అన్ని దరఖాస్తులను రోజువారీగా పరిశీలిస్తున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతను గుర్తించి ఓటరుగా నమోదు చేస్తున్నామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్‌లు మను చౌదరి, చంద్ర మోహన్, ఆర్డీవోలు శ్రీనివాస్, ప్రభాకర్, భుజంగరావు, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, డీపీవో శ్రీనివాస్, సీపీవో రాజారాం, తహసీల్దార్ లత, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

చేప పిల్లల పంపిణీకి సిద్ధం

- 697 చెరువుల్లో 2.78 కోట్ల చేప పిల్లలు
- ఏడు జలాశయాల్లో 60.40 లక్షల రొయ్యలు
- విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



నిజాంసాగర్ ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల చేస్తున్న నాయకులు (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం చెరువులు, జలాశయాల్లో ఉచితంగా చేప పిల్లలు, రొయ్య పిల్లలను విడుదల చేస్తోంది. ఎనిమిదేళ్లుగా వంద శాతం సబ్సిడీపై చేప, రొయ్య పిల్లలను మత్స్యకారులకు అందజేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా చెరువుల్లో వదలడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 226 మత్స్యకార సంఘాలు ఉండగా 13,550 మంది మత్స్యకారులు ఉన్నారు. జిల్లాలోని 695 చెరువులతో పాటు నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టుల్లో 2.78 కోట్ల చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

వర్షాలతో ఆలస్యం

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు అలుగు పారుతున్నాయి. దీంతో చెరువులు, ప్రధాన జలాశయాల్లో చేప పిల్లల విడుదల ఆసల్యమైంది. ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై చేపలు, రొయ్య పిల్లలను సరఫరా చేస్తుండటంతో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా చేప పిల్లల విడుదలను ప్రారంభించేందుకు అధికారులు ఎదురు చూస్తున్నారు. ఆయా చెరువులు, ప్రధాన జలాశయాల్లో రూ.3.19 కోట్లు విలువ చేసే చేప పిల్లలను వదలనున్నారు. అలాగే నిజాంసాగర్, కౌలాస్ ప్రాజెక్టులతో పాటు ఐదు చెరువుల్లో రూ.1.44 కోట్ల విలువైన 60.40 లక్షల రొయ్య పిల్లలను వదలనున్నారు.

రొయ్య పిల్లలను వదిలే జలాశయాలు

చెరువులు	రొయ్య పిల్లలు
నిజాంసాగర్ ప్రాజెక్టు	48.18 లక్షలు
కౌలాస్ ప్రాజెక్టు	4.9 లక్షలు
ఇబ్రహీంపేట చెరువు	1.89 లక్షలు
కామారెడ్డి పెద్ద చెరువు	1.88 లక్షలు
సదాశివనగర్ పెద్ద చెరువు	1.56 లక్షలు
దోమకొండ గూండ్ల చెరువు	91.6 వేలు
మాచారెడ్డి చెరువు	1.20 లక్షలు

సమ్మెకు దిగిన అంగన్‌వాడీలు

- ఆర్పీలు, వీవోఏలకు సెంటర్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించిన అధికారులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెలో కూర్చున్న అంగన్‌వాడీలు



కామారెడ్డి టౌన్: తమకు కనీస వేతనం చెల్లించాలని, రెగ్యూలరైజ్ చేయాలని జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, సిబ్బంది సోమవారం సమ్మెలోకి దిగారు. సెంటర్‌లకు తాళలు వేసి సమ్మెలో కూర్చున్నారు.అంగన్‌వాడీల్లో సేవలు నిలిచి పోగా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసారు. జిల్లాలోని 1193 సెంటర్‌లకు మున్సిపల్ ఆర్పీలు, వీవోఏలను నియమించి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. తాళాలు పగుల గొట్టి సెంటర్‌లను తెరిపించారు. సెంటర్‌లలోని బియ్యం, సామగ్రి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కాగా తమకు సంబంధంలేని అంగన్‌వాడీ విధులు అప్పగించడంపై ఆర్పీలు, వీవోఏలు మండిపడుతున్నారు. ఇప్పడికే పనిభారంతో ఉంటే అధనంగా ఈ బాధ్యతలు ఇవ్వడంపై మండిపడుతున్నారు. అయితే జిల్లాలో కొందరు టీచర్లు, ఆయాలు మాత్రం విధుల్లో చేరారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెలో అంగన్‌వాడీలు కూర్చున్నారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లా డుతూ అంగన్‌వాడీ సెంటర్‌ల తాళాలు దొంగతనంగా తెరిపించిన అధికారుల పైన పోలీసులు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధకంగా 20 రోజుల ముందు అధికారులకు నోటీస్ ఇచ్చి సమ్మెలోకి దిగామన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్క ర్స్ యూనియన్ అధ్యక్షులు వి కల్పన, కార్యదర్శి సునంద, యాదమ్మ, లక్ష్మి, ఇంద్ర, జరీనా, సుక న్య, లలిత, భాగ్య, రాధ రాణి, కవిత, సుజాత, వీనాబాయ్, సంతోషి, అరుణ, సురేఖ, సిద్ధమ్మ, స్వరూప, రాధ, తదితరులు పాల్గొన్నారు.



టేక్రియాల్‌లో అంగన్‌వాడీ కేంద్రం తాళం తీయించిన మున్సిపల్ కమిషనర్ దేవేందర్

క్లుప్తంగా

వైభవంగా గంగమ్మ ఆలయ వార్షికోత్సవం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లి శివారులోని ఊరచెరువు వద్ద సోమవారం ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పురోహితుడు శివకుమార్‌శర్మ వేదమంత్రోచ్చరణాలతో వార్షికోత్సవాన్ని జరిపించారు. గ్రామస్తులు పూజాకార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ దేశబోయిన సాయిలు పాల్గొన్నారు.

12వ రోజుకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె



కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె శిబిరంలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. దశరత్, కాంట్రాక్ట్ ఉద్యోగులు డీఈవోలు, స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టులు, నాయకులు పాల్గొన్నారు.

20లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్‌అర్బన్: ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫీజును అపరాధ రుసుంతో ఈ నెల 20 వరకు చెల్లించవచ్చని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో జరగబోయే పరీక్షలకు సంబంధించి తాత్కాలిక ఫీజును అపరాధ రుసుముతో చెల్లించవచ్చన్నారు. పదో తరగతి వారు సబ్జెక్టుకు రూ.వంద అపరాధ రుసుముతో, ఇంటర్ అభ్యర్థులకు సబ్జెక్టుకు రూ.150, తాత్కాల్ ఫీజు రూ.వెయ్యి చెల్లించాలని వివరించారు.

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని నాగారం మైనారిటీ గురుకుల కాలేజీలో ఎక్సైజ్ శాఖ, జేసీఐ ఇందూర్ ఆధ్వర్యంలో సోమవారం డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థలకు దూరంగా ఉండాలన్నారు. నయస్, మహమ్మద్ అబ్దుల్ బషీర్, విజయానంద్, ఇలియాస్, మౌలానా పాల్గొన్నారు.

వినాయకుడి ఆకారంలో బొప్పాయి



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో బొప్పాయి వినాయకుడి రూపంలో కాసింది. మంగ్లారం గంగాధర్ అనే రైతు పెరట్లో కాసిన బొప్పాయి గణపతి ఆకారంలో ఉంది. సోమవారం దానిని దేవుడి ఫొటోల వద్ద ఉంచి పూజలు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

- నిరవధిక సమ్మెకు దిగిన అంగన్‌వాడీలు
- కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్



దొంగ్లీలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడి టీచర్లు

సాక్షి నెట్‌వర్క్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండు చేస్తూ సోమవారం అంగన్‌వాడి ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించాలని అంగన్‌వాడీలు కోరారు. అలాగే ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమ్మెకు బీజేపీ, కాంగ్రెస్, సీఐటీయూ నాయకులతో పాటు పలు పార్టీల నేతలు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు.

బెదిరింపులు మానుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): అంగన్‌వాడి ఉద్యోగులపై బెదిరింపులు మానుకోవాలి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో అంగన్‌వాడి ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరంలో మాట్లాడారు. 6 నెలలుగా అంగన్‌వాడి ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు. మంత్రులను కలిసినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దాంతో సెప్టెంబర్ 11 నుంచి నిరవధిక సమ్మెకు దిగినట్లు తెలిపారు. ఉద్యోగులకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు.



పిట్లంలో..



నిజాంసాగర్‌లో..



లింగంపేటలో ..



నాగిరెడ్డిపేటలో ..



ఎల్లారెడ్డిలో..

వీవోఏలకు అంగన్‌వాడీ బాధ్యతలు



నిజాంసాగర్(జుక్కల్): అంగన్‌వాడి ఆయాలు, టీచర్లు నిరవధిక సమ్మెకు చేస్తుండటంతో సోమవారం మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడి బాధ్యతలను వద్యేలకు అప్పగించారు. అంగన్‌వాడి కేంద్రాల తాళాలు తీయించి వీవోఏలకు రిజిస్టర్లను అప్పగించారు. హసన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో నాగేశ్వర్‌రావ్ తెరిపించి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించారు.

త్వరగా సమస్యలను పరిష్కరించాలి



బాన్సువాడ: అంగన్‌వాడీ టీచర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ అన్నారు. బాన్సువాడలో కొనసాగుతున్న అంగన్‌వాడి టీచర్ల నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు చేస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలని అన్నారు. నాయకులు గుడాల నగేష్, దాసరి శ్రీనివాస్, అక్బర్, గంగాధర్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

డ్వాక్రా సంఘం సీఏలకు అప్పగింత



రామారెడ్డి (ఎల్లారెడ్డి): అంగన్‌వాడీలు సమ్మెకు దిగడంతో ఇబ్బందులు తలెత్తకుండా డ్వాక్రా సంఘం సీఏలు, వీవోఏలకు అంగన్వాడి సెంటర్ల బాధ్యతలను అప్పగించారు. అంగన్వాడి టీచర్లు సెంటర్ తాళాలను ఇవ్వకపోవడంతో గొల్లపల్లి అంగన్వాడి సెంటర్ తాళాలను సోమవారం కార్యదర్శి జనార్దన్ సమక్షంలో పగలగొట్టారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

కామారెడ్డి రూరల్: హైదరాబాద్‌లో అక్టోబర్ 4న తలపెట్టే దళిత 57 ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పస్తం పరుశురాం కోరారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరీ వెంకటేశం ఆదేశాల మేరకు పరశురాంతో పాటు జిల్లా గోసంగి సంఘం అధ్యక్షుడు కల్లెం సత్యం, ప్రధాన కార్యదర్శి సంకు పోచయ్య, కోశాధికారి కడమంచి పోలు, పెంటయ్య, సాదుల యాదగిరి, సాయిలు చిన్న మల్లారెడ్డి గ్రామంలో సోమవారం బుడగ జంగాల కులస్తులను కలిశారు. ఆత్మగౌరవ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనువడు ప్రకాశ్ అంబేద్కర్ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్న మల్లారెడ్డికి చెందిన బుడగ జంగం అధ్యక్షుడు సద్దుల యాదగిరి, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నమల్లారెడ్డిలో బేడ బుడగ జంగాల కాలనీలో సమావేశం నిర్వహిస్తున్న నాయకులు

చెట్టును ఢీకొన్న బస్సు



కామారెడ్డి క్రైం: కామారెడ్డి నుంచి పెద్దమల్లారెడ్డి వెళ్తున్న ఆర్టీసీ బస్సు జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులతో పాటు కండక్టర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో దోమకొండకు చెందిన చంద్రకళ, పెద్దమల్లారెడ్డికి చెందిన వాసవి, ముత్యంపేట గ్రామానికి చెందిన లక్ష్మీ, సంగమేశ్వర్‌కు చెందిన శారద, ధర్మరావుపేటకు చెందిన అనసూయ, కండక్టర్ ప్రసన్న ఉన్నారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు చెబుతున్నారు. గాయపడిన ప్రయాణికురాలు చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

15న జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు

నిజామాబాద్‌నాగారం: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 15న జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్ తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా 15న సుభాష్‌నగర్‌లోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'నేటి ప్రపంచానికి గాంధేయవాద ఆవశ్యకత' అనే అంశంపై మాట్లాడాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 29 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఉపన్యాసం హిందీ/ఇంగ్లిష్‌లో మాత్రమే ఉండాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 14 సాయంత్రం 5గంటల లోపు తమ వివరాలను 9100435410 నంబర్‌కు వాట్సాప్‌లో పంపాలని సూచించారు.

కిటకిటలాడిన ఆలయాలు



సలాబత్‌పూర్ శివాలయంలో భక్తులు



దోమకొండ: అగ్రహారం పోశమ్మకు బోనాలు

సాక్షి నెట్‌వర్క్: శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా జిల్లాలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్నదానాలు చేశారు.



తాడ్వాయి: చిట్యాల శివాలయంలో పూజలు



ఎల్లారెడ్డి నీలకంఠేశ్వరాలయంలో..



భిక్కనూరు: సిద్ధరామేశ్వరాలయంలో భక్తుల రద్దీ

ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్



పిట్లం పోలీస్‌స్టేషన్‌లో ఆశావర్కర్లు



నిజాంసాగర్ పోలీస్‌స్టేషన్‌లో..

పిట్లం/నిజాంసాగర్: హైదరాబాద్‌లో ఆరోగ్య కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న జిల్లాలోని ఆశ వర్కర్లను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. స్థానికంగా ఉన్న పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ..న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని హైదరాబాద్ వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం శోచనీయమన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు.

త్యాగాలకు గుర్తుగా మేరీ మిట్టి మేరా దేశ్



బీబీపేటలో మట్టిని సేకరిస్తున్న వెంకటరమణారెడ్డి



తుజాల్‌పూర్‌లో ఆలయానికి భూమిపూజ చేస్తూ..

బీబీపేట: దేశం, స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుల త్యాగాలకు గుర్తుగా మేరీ మిట్టి మేరా దేశ్ అభియాన్‌లో భాగంగా సోమవారం కామారెడ్డి బీజేపీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ఐక్యతా సందేశాన్ని ప్రచారం చేస్తూ వీరులను స్మరించుకుంటూ భవిష్యత్ నిర్మాణం కోసం దేశ ప్రజలందరినీ భాగస్వాములను చేసేందుకు ఢిల్లీలో అమృత వాటికను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే మట్టి సేకరణలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. అనంతరం తుజాల్‌పూర్‌లో దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

ఆ డబ్బులను మంత్రే ఆపేయించారు

- హత్యాకేసు నిందితుడికి కొమ్ము కాస్తున్న ప్రశాంత్ రెడ్డి
- కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ రెడ్డి ఆరోపణ



మంత్రి ర్యాలీలో నిందితుడు ఉన్న చిత్రాన్ని చూపిస్తున్న సునీల్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్‌లో రెండేళ్ల క్రితం హత్యకు గురైన మాలవత్ సిద్ధార్థ్ కుటుంబ సభ్యులకు ఎస్టీ కార్పొరేషన్ నుంచి రావలసిన డబ్బులను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆపేశారని కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మోర్తాడ్‌లోని సునీల్‌రెడ్డి నిలయంలో సునీల్‌రెడ్డిని సిద్ధార్థ్ కుటుంబ సభ్యులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ సిద్ధార్థ్ తండ్రి అనారోగ్యం బారిన పడితే సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకుంటే మంత్రి ఆగ్రహంతో చింపేశారని అన్నారు. హత్య కేసులో నిందితుడిగా ఉన్న రాజేశ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశామని చెప్పి, మంత్రి నిర్వహించే ర్యాలీలో తన వెంట తిప్పుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. నిందితుడిపై పెట్టిన కేసులో కాల్ డేటాపై ఇప్పటికీ స్పష్టత లేదని అన్నారు. మంత్రి బాధిత కుటుంబానికి తక్షణం న్యాయం చేయాలని సునీల్ రెడ్డి డిమాండ్ చేశారు.

13న నృత్యోత్సవ్



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఈ నెలా 13న డ్యాన్స్ అసోసియేషన్, తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నృత్యోత్సవ్ -2023 నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు తోగటి ఆనంద్ బాబు తెలిపారు. సోమవారం స్థానిక వినాయక్‌నగర్ డ్యాన్స్ అకాడమీలో ఆయన మాట్లాడారు. జిల్లాస్థాయి సాంస్కృతిక కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, డ్యాన్స్ అకాడమీ విద్యార్థులతో బృందాల వారీగా నృత్య ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఇందులో జానపదం, పేరిణి, కూచిపూడి, భరతనాట్యం, దేశభక్తి, సినీపాటలపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. సమావేశంలో డ్యాన్స్ అకాడమి కార్యదర్శి తోట సతీష్, పసునూరి వినయ్ కుమార్, తోట ప్రశాంత్, నవనీత, సిద్దార్థ్, ఆదిత్య, బాబి, అమృత, గీతాంజలి, రాము, సాయితేజ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

భిక్కనూరు: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన మహిళ సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన ప్రవళిక వివాహం 16 నెలల క్రితం కరీంనగర్ జిల్లా వీణవంక మండల జంగంపల్లి గ్రామానికి చెందిన జగన్నాథుల సంపత్‌తో జరిగింది. పెళ్లి సమయంలో కట్న కానుకలు అందజేశారు. అయినా రూ.4.5 లక్షలు, రెండు తులాల బంగారం తీసుకు రావాలని బెదిరిస్తున్నారని భర్త సంపత్, అత్త మామలు రాజవ్వ, రాజయ్య, మరిది హరీశ్‌పై ఫిర్యాదు చేసింది.

చీటింగ్ కేసు నమోదు

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన రాజ్‌కుమార్‌ను మలేషియాకు పంపిస్తానని మోసం చేయడంతో లింగితండాకు చెందిన సాయిలుపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. రాజ్‌కుమార్‌ను మలేషియా పంపిస్తానని సాయిలు డబ్బులు తీసుకున్నాడు. అక్కడికి వెళ్లాక కంపెనీ వారు వచ్చి తీసుకెళ్తారని చెప్పడంతో రాజ్‌కుమార్ మలేషియా ఎయిర్‌పోర్టులో దిగాడు. ఎవరూ రాకపోవడంతో సాయిలుకు ఫోన్ చేయగా, తిరిగి భారత్‌కు రావాలని సూచించారు. డబ్బులు ఇవ్వాలని అడగగా, రూ.75వేలు చెల్లిస్తానని ఒప్పంద పత్రం రాసిచ్చాడు. డబ్బులు చెల్లించకపోవడంతో బాధితుడు ఫిర్యాదు చేశారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

మోపాల్: మండలంలోని చిన్నాపూర్‌కు చెందిన గోద హన్మాండ్లు మద్యం తాగి వాహనం నడిపినందుకు జడ్జి రెండ్రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు. మోపాల్‌లో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా, హన్మాండ్లు మద్యం తాగి బైక్ నడుపుతూ దొరికాడన్నారు.

డబ్బులు ఇవ్వలేదని అమ్మమ్మ హత్య



అక్కవ్వ మృతదేహం

నిజాంసాగర్(జుక్కల్): మద్యం కోసం డబ్బులు ఇవ్వడం లేదని యువకుడు అమ్మమ్మ వరుసయ్యే వృద్ధురాలిని హతమార్చాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం తెల్గపూర్ గ్రామానికి చెందిన దుంపల అక్కవ్వ (70)కు సంతానం లేదు. అక్కవ్వ తన సొంత అక్క సంగవ్వ కూతురు సాయవ్వ వద్ద ఉంటుంది. కాగా సాయవ్వ కొడుకు బాలపోచయ్య డబ్బుల కోసం అక్కవ్వను తరచూ వేధించేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయవ్వ, అంజయ్య దంపతులు ఊరికి వెళ్లగా బాలపోచయ్య, అక్కవ్వ ఇద్దరు ఇంట్లో ఉన్నారు. అర్ధరాత్రి వేళ తనకు డబ్బులు ఇవ్వాలని బాలపోచయ్య అక్కవ్వతో గొడవపడ్డాడు. డబ్బులు లేవని అక్కవ్వ నిరాకరించింది. దీంతో అక్కసు పెంచుకున్న బాలపోచయ్య మంచంపై నిద్రిస్తున్న అక్కవ్వ గొంతుపై గొడ్డలితో నరికి చంపాడు. వృద్ధురాలి మృతదేహంపై నూలురగ్గు కప్పి ఇంట్లో నిద్రించాడు. ఉదయం 11 గంటల ప్రాంతంలో గ్రామంలోకి వెళ్లిన బాలపోచయ్య మా అమ్మమ్మ మంచంపైన చనిపోయి ఉందని గ్రామ సర్పంచ్ నారాయణతో పాటు గ్రామస్తులకు తెలిపాడు. వారు ఇంటికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో అక్కవ్వ కనిపించింది. బాలపోచయ్యను నిలదీయగా డబ్బులు అడిగితే ఇవ్వడం లేదన్న కొపంతో గొడ్డలితో నరికి చంపినట్లు తెలిపాడు. సమాచారం మేరకు బాన్సువాడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

చెరువులో పడి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి సమీపంలోని అడ్లూరు శివారులో ఉన్న బయ్యని చెరువు వద్ద సోమవారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డిలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కెంగర్ల శివశంకర్ (45) ఆటో నడిపిస్తూ జీవనం సాగించేవాడు. తన సెల్ ఫోన్ ఎక్కడో పడిపోయిందని, వెతికి వస్తానని ఇంట్లో చెప్పి ఈనెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని మృతదేహం చెరువులో తేలడంతో సోమవారం దేవునిపల్లి పోలీసులు విచారణ జరిపారు. మృతుడిని శివశంకర్‌గా గుర్తించారు. కాలకృత్యాలకు వెళ్లి చెరువులో జారిపడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

భిక్కనూరులో బైక్ చోరీ

భిక్కనూరు: భిక్కనూరుకు చెందిన ఊరే సిద్దరాములు బైక్ ఆదివారం అర్ధరాత్రి చోరీకి గురైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. సిద్దరాములు తన బైక్‌ను ఆదివారం రాత్రి ఇంటి ముందట పార్క్ చేశాడు. సోమవారం వేకువ జామున లేచి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాటస్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్‌లో పేకాడుతున్న ఎనిమిది మందిని టాస్క్‌ఫోర్స్ సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.26,900 నగదు, 8 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన జిల్లారపు రాజు అదృశ్యమైనట్లు ఎస్సై రాము సోమవారం తెలిపారు. రాజు ఆంధ్రప్రదేశ్‌లోని ఓ సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇక్కడికి వచ్చిన రాజు వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రాగా, బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో రాజు తండ్రి హన్మాండ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.